# పొదుపు లక్ష్మి

- ఎ.పుష్పాంజలి

"నాకో బ్రహ్మాండమైన ఆలోచనొచ్చింది. ఆ ఆలోచన అమలు చేశామంటే ఒక్కోరికి నెలకి కనీసం ఆరువేలు మిగుల్తుంది" అంది లక్ష్మి.

"అలాగా అక్కయ్యా? తొందరగా చెప్పు. ఏమిటది?" అని ఆమె దగ్గర చేరారు యమునా, ఉష.

పొదుపు పథకాలు ఆలోచించడం, వాటిని అమలుచేయడంలో లక్ష్మి దిట్ట. ఆమె దగ్గర్నుంచి పొదుపుకు సంబంధించిన హింట్స్ తెలుసుకున్న యమునా, ఉష ఇప్పటికే బోలెడంత బాగుపడ్డారు.

"ఏంలేదు. నే చెప్పేది జాగ్రత్తగా వినండి. మనం ఒక తల్లి బిడ్డల్లాగా కలిసిపోయాం. ఈ లోగిల్లో మూడు పోర్షన్స్‌లో ఉంటున్నా ఒక తల్లీ బిడ్డల్లానే కాకుండా ఒకింటివాళ్లల్లా మసలుకుంటున్నాం కదా" అంది లక్ష్మి.

"నిజమేనక్కయ్యా" ఉష.

"కాబట్టి మనం నెలకి ఒక్కరింట్లో మాత్రం వంట చేస్తాం. నెలకి ఒక్కరింట్లో మాత్రమే రిఫ్రిజిరేటర్ వాడ్తాం. ఒక్కరింట్లో మాత్రం టీ.వి. చూస్తాం. పిల్లలంతా ఒకేచోట అంటే నెలకి ఒకరింట్లో చదువుకుంటారు. అదే విధంగా ఇక మనకు ముగ్గురు పనిమనుషులుండరు. ఎవరింట్లో వంట చేస్తామో వాళ్లింట్లో మాత్రమే పని మనిషి. ఇలా చేస్తే బోలెడంత గ్యాసూ, కరెంటూ, వాటరూ అంతా ఆదా అవుతాయి. గ్రాసరీ కూడా కలిసొస్తుంది"

"ఎంత మంచయిడియా అక్కా" అంది యమున.

"ఈ గుడ్డయిడియా మా వారికి చెప్తే ఎగిరి గంతేస్తారు" అంది ఉష. ఈ పొగడ్తల వల్ల ద్విగిణీకృతమైన కాన్ఫిడెన్స్‌తో మళ్లీ మొదలెట్టింది లక్ష్మి.

"ఇంకా వినండి. పిల్లలకి ఆటోలు మాన్పిద్దాం. ఆరుగురు పిల్లల్ని వెహికిల్లో నెలకొకరు చొప్పున మన శ్రీవార్లు స్కూల్లో ఒదుల్తారు. దీనివల్ల పిల్లాడికొకరికి రెండు వందల చొప్పున ఆరుగురికీ కలిపి ఆరువందలు మిగుల్తుంది" అంది లక్ష్మి.

ఆమె చెప్పిన ఈ బ్రహ్మాండమైన పొదుపాలోచనకు మిగతా ఇద్దరూ ఈసారి కన్నీటిపర్యంతమైనారు.

లక్ష్మి పొదుపులో గొప్ప నిపుణురాలు కావడంవల్ల ఆమెనంతా 'పొదుపు లక్ష్మి' అంటుంటారు. ఆ తర్వాత వాళ్లు ముగ్గురూ కలిసి ఈ పొదుపు పథకానికి సంబంధించిన ప్రణాళికను రూపొందించనారంభించారు.

వాళ్ల మూడు కుటుంబాలు అక్కడ చేరి మూడునెలలే అయింది. బహుశా అందుకేనేమో, వాళ్లు బహు సఖ్యంగా ఉంటున్నారు. ఒకరింట్లో ఏది చేసినా మిగతా రెండిళ్లకీ వెళ్లాల్సిందే. బజార్లకూ, సినిమాలకూ, షికార్లకూ, గూళ్లూ గోపురాలకూ ముగ్గురు గృహిణులూ కలిసే వెళ్తుంటారు. ఈ మధ్యనే వినాయక చవితి పండగ కూడా కలిసే చేసుకున్నారు. లక్ష్మికపుడే ఈ ఆలోచన అంకురించింది.

మొదటి తారీకున ఈ పథకం యమున ఇంట్లో మొదలైంది. పని మనిషి యమున ఇంట్లోనే.

ఫ్రిజ్ వాళ్లింట్లోనే ఆన్. వంట చేసి కారియర్లు సర్దుతున్నారు. ఈ నెలకు పాలు, గ్రాసరీ అన్నీ యమునే కొన్నది. యమున భర్త పిల్లలారుగుర్నీ అంటే ఒక్కో ఫ్యామిలీలో ఇద్దరు పిల్లలు, తన వెహికిల్లో స్కూల్లోనే తీసుకపోతున్నాడు, తీసుకొస్తున్నాడు.

పక్కింట్లో లక్ష్మి భర్త భాస్కర్‌రావు "లక్ష్మీ! నాకాఫీసు టైమయింది వంటింకా కాలా?" అన్నాడు.

"పనిమనిషితో కలిపి పదమూడు మందికి రెడీ చెయ్యాలి. కొంచెం ఓపిక పట్టండి" అంది లక్ష్మి.

"ఏం రెడీనో ఏమో, ఉదయం కాఫీ చల్లగా ఉంది" అన్నాడతను.

"పక్కింటినుంచి చెంబుతో తెచ్చానాయె! చల్లారవటండీ" అంది.

ఈ పథకం మొదలైన కాస్త టైములోనే ఆ తిండి కేవలం బతకడానికి మాత్రమే తినేదని గ్రహించాడు భాస్కర్రావు. హోటల్‌కి పోయి కాఫీ తాగుదామని బైటపడ్డ భాస్కర్రావు అక్కడి దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు.

ఎదురుగా యమున భర్త ఆరుగురు పిల్లల్ని తన స్కూటర్లో సర్దడానికి తిప్పలు పడుతున్నాడు.

"ఏమిటండీ శంకర్రావుగారూ" పకపకా నవ్వుతూ అడిగాడు.

"నవ్వకండి సార్. వచ్చేనెల మీటర్నొస్తుందిగా! అప్పుడు తెలుస్తుంది" ఉక్రోషంగా అన్నాడు శంకర్రావు.

"అంకుల్! స్కూల్ టైమయింది. తొందరగా పదండి" అని పిల్లలు తొందర చేసేసరికి సర్కస్ వీరుడిలా బయల్దేరాడు శంకర్రావు.

ఒక నెల విజయవంతంగా పూర్తయింది. పని మనిషిని మానిపించడం వల్ల మూడొందలూ, స్కూల్‌కి పిల్లల్ని ఆటోలో పంపకపోవడంవల్ల నాలుగొందలూ, గ్రాసరీ కొనకపోవడంవల్ల రెండు వేలు ఇలా ఒకటేమిటి, అన్నిట్లో పైసలు మిగిలాయి.

లక్ష్మిని కూచోబెట్టి పొగడ్తలతో నింపేశారు ఉష, యమునలు.

మరుసటి నెలలో ఉష ఇంట్లో ప్రారంభమైంది పొదుపు పథకం.

ప్రారంభమైన రెండో రోజే ఉష లక్ష్మి దగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చి "అక్కా! నాకొక సమస్యొచ్చింది. మా ఇంటికి బంధువులొస్తున్నారు. ఇదిగో లెటరు" చూపింది.

ఆ బంధువులు తాము ఆ ఊరొస్తున్నట్లూ, ఒకవేళ ఉష ఆమె భర్తా ఊళ్లో ఉండేటట్టయితే, తమకు తెలిపితే వస్తామనీ రాశారు.

దాన్ని లక్ష్మి రెండుగా చించి పారేస్తూ "దీనికి నువ్వేమీ జవాబివ్వకు" అంది.

ఆమె సూచించిన ఈ అద్భుతమైన పరిష్కారానికి ఉప్పొంగిపోయింది ఉష.

"ఈ పొదుపు పథకం సమయంలోనే కాదు. మామూలప్పుడు కూడా నేను చేసేదిదే" అన్నది లక్ష్మి.

"అక్కా! నువ్వు పొదుపుకు మరో రూపం" అన్నది ఉష.


అవాళ వాళ్లంతా ఉష వంటింట్లో ఉషకి సాయం చేస్తూ ఎదురింటి యశోదమ్మ, పక్కింటి పార్వతమ్మల గురించి తనివితీరా మాట్లాడుకున్నారు. వాళ్లంటే వీళ్లకెవ్వరికీ పడదు.

అప్పుడు చెప్పింది లక్ష్మి.

"ఏమమ్రా! మనకి మరింత ఆదాయం చేకూర్చే అయిడియా ఒకటి చెప్పనా?"

"చెప్పక్కా"

"ఏం లేదు. మనం ప్రస్తుతం ఒక్కో యింటికి మూడువేల చొప్పున తొమ్మిదివేలు రెంటిస్తున్నాం. దానికి తోడు కరెంటు బిల్లు ఒక్కో ఇంటికి మూడొందల చిల్లర! అంటే మొత్తం పదివేలు అకామిడేషన్ కోసం ఖర్చు చేస్తున్నాం. అలా కాకుండా అందరం ఒకే ఒక పెద్ద ఇల్లు,



అంటే కనీసం ఆరువేలు బాడుగ కలది, మూడు బెడ్‌రూంలు, అటాచ్ బాత్ రూంలుండేది తీసుకుంటే మనకి డబ్బులు మిగుల్తాయ్. ప్లస్ పెద్ద బంగళాలో ఉన్నామన్న తృప్తీ ఘనతా కూడా దక్కుతాయిగా''

అక్క చెప్పిన ఈ అద్భుతమైన అయిడియాకి ఉప్పొంగిపోయారు చెల్లెళ్లిద్దరు.

'ఈ విషయం మా వారికి చెప్తే బోలెడంత సంతోషపడిపోతారు' అనుకున్నారు ప్రతి ఒక్కరు.

ఆ మేరకు అటువంటి ఇంటికోసం అన్వేషించడం మొదలెట్టారు.

ప్రస్తుతం లాండ్ లైను ఫోను ఉష ఇంట్లోనే ఉంది. కాబట్టి లాండ్ లైను ఫోనులన్నీ అందరూ అక్కణ్ణించే చేసి ఆ బిల్లు కూడా డివైడ్ చేసుకుందామని నిర్ణయించుకున్నారు.

అవాళరాత్రి పిల్లలంతా ఉష ఇంట్లో చదువుకుంటున్నారు. ఆడవాళ్లు ముగ్గురూ దగ్గర్లో కూచుని మాట్లాడుకుంటుండగా ఉష పిల్లల్తో అన్నది.

“ఒరే నాన్నలూ, మీకు ఒక్కొక్కరికి ఒక్కో పెన్సిలూ, రబ్బరూ, బ్లేడూ, జామెట్రీ బాక్స్ ఎందుకూ? ఒక్కదాన్నే అందరూ కలిపి వాడుకోవచ్చుగా?''

పిల్లలు తెల్లమొఖ పెట్టారు.

యమున అందుకుని “నిజమే ఉషా, మన పిల్లలకి విడివిడి పుస్తకాలక్కర్లేదు. ముగ్గురికొక సెట్, మిగతా ముగ్గురికొక సెట్ చాలు కదా'' అంది.

వాళ్ల పిల్లల్లో పెద్దవాళ్లు ముగ్గురూ ఆరోక్లాసూ, చిన్నవాళ్లు ముగ్గురూ నాలుగో క్లాసూనన్నమాట.

“మీరిద్దరూ పొదుపులో నన్నే మించిపోయారు. మీ ఐడియా ఎంతో బావుంది'' అన్నది లక్ష్మి.

“కలిసి ఉండే కలదు సుఖం! ఒక కుండలో వంట, మిగిలిస్తుంది మూట'' అనీ “పైసలు తక్కువ, వసతులు ఎక్కువ'' అనీ తమ పథకాలకి విశేషణాలు తగిలించుకుంటూ మురిసిపోయారు.

డ్రీమ్‌హౌస్ తొందరగా వెదకమని భర్తలను పోరుపెట్టడం మొదలైంది.

ఉమ్మడి సాంఘిక జీవనానికే ప్రతిష్ఠాత్మకమైన ఉదహారణగా నిలిచిన ఈ పొదుపు ఉద్యమం దిగ్విజయంగా రెండు నెలలు ముగించుకుని మూడో నెలలో లక్ష్మి ఇంట్లో మొదలైంది.

ఆ తర్వాత నాల్రోజులకి ఉష, యమున ఒక రహస్య సమాలోచన జరిపారు.

“ఉదయం ఉప్మా చూశావా, ఆయిల్ ఒక స్పూను కూడా వేసినట్టు లేదు. సంగటిలాగా ఉంది. అసలు తినలేకపోయాం'' అన్నది యమున.

“అయ్యో. ఏం చెబుతావులే. మావారు తినకుండా అక్కడే పెట్టేసి వెళ్తే కుక్కకి పెట్టేశా'' అన్నది ఉష.

అంతలో లక్ష్మి వస్తున్న అలికిడైంది.

“ఏమర్రా ఏం చేస్తున్నారక్కడ? ఆక్కూరలు ఒలవాలి రండి'' అంది.

“వస్తున్నామక్కా'' అంటూ లక్ష్మితో వెళ్లారు.

పెరుగు తోటకూర కాబోలు, ముదిరిపోయి దంట్లలాగా ఉంది.

“ఈ ఆకెక్కడిదక్కా''

“మనకి పాలుపోసే అమ్మి వాళ్ల బర్రెకోసం తీసుకెళుతుంటే దాన్లోనుంచి నేను కొంత పీక్కున్నాను'' అంది లక్ష్మి.

“అలాగా!'' యమున.

“ఇంత మంచి ఆక్కూర తీసుకెళ్లి బర్రెముఖాన పెడుతుందా బుద్ధిలేని పిల్ల! అయినా అదేమిటి మీరిద్దరూ కాడలన్నీ పారేస్తున్నారే!'' అన్నది లక్ష్మి.

ఈ ముదురుకాడలుంటే మావారు భోంచేయరక్కా'' అన్నది యమున.

“మా పిల్లలు కూడా'' చెప్పింది ఉష.

“ఓసి పిచ్చి తల్లుల్లారా! అవి ఎంతమాత్రం ముదురుకాడలు కావు. సన్నగా తరిగి కుక్కర్లో ఉడికిస్తే వెన్నలా ఉడికిపోవూ?'' అన్నది లక్ష్మి.

మిగతా ఇద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు.

“ఉదయం ఉప్మా ఎక్కువ చేసేసి అందరికీ లంచ్ బాక్సులు సర్దిచ్చేశా. ఇక ఇది రాత్రికి. ఎలాగూ ఆవురావురుమంటూ ఆకలితో వస్తారు కాబట్టి ఏది పెట్టినా తింటారు'' అన్నది లక్ష్మి.

వళ్లు మండింది ఉష యమునలకి. ఐనా ఏమీ చేయలేక మౌనంగా ఉండిపోయారు.

మళ్లీ ఉష ఇంట్లో రహస్య సమాలోచన జరిగింది.

“చూశావా! ఖర్చు తగ్గడానికి రెండుపూటలకీ ఉప్మా చేసేసి ముఖాన కొట్టింది''

“నిన్న ఆ భాస్కర్రావు పిల్లల్ని స్కూల్‌కి తీసుకపోతుండగా మా వాడు

## వింతలు...విడ్డూరాలు

★ 'ఫ్రాన్స్'కు చెందిన 'నేన్‌సీ'లోని ఒక కుటుంబంలో అందరికీ రెండేసి ఎడమచేతులే ఉన్నాయి! కుడిచేతులెవరికీ లేవు. ఆ కుటుంబంలోని మగవాళ్ల లోపమే ఇందుకు కారణమని డాక్టరు తేల్చి చెప్పారు.

★ టాల్‌స్టాయ్ 'జీవితంలో ఎప్పుడూ పెళ్ళి చేసుకోకండి' అని తన కుమార్తెలకు పదే పదే చెప్పేవాడు. ఐతే ఆయనగారి ముగ్గురు కూతుర్లల్లో ఒక్క అమ్మాయి మాత్రమే ఆయన చెప్పిన మాటను ఆచరణలో పెట్టింది. ఆమె పేరు 'అలెగ్జాండ్రియా'

★ పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పదార్థాలనుసైతం సునాయాసంగా చూడగల దృష్టి కేవలం నిప్పుకోడికి మాత్రమే ఉంది సృష్టిలో!

★ సహారా ఎడారిలో నీటికోసం బావి త్రవ్వాలంటే కనీసం ఐదారు వేల అడుగుల లోతుకెళ్ళాల్సిందే!

★ సీరియల్ నవలలను ప్రారంభించిన తొలి నవలాకారుడు 'చార్లెస్ డికెన్స్'

★ 48లో మహాత్మాగాంధీ తుపాకీ గుళ్లకు బలిఐతే 84లో ఇందిరా గాంధీని అదే తుపాకీ బలి తీసుకుంది.

★ అమెరికా జాతీయగీతాన్ని 1814లో ప్రముఖ న్యాయవాది 'ఫ్రాన్సిస్ స్కాటీక్' రచించగా అమెరికా అధ్యక్షులు దీనిని 1916లో జాతీయగీతంగా అంగీకరించారు!

-జయసౌజన్యామూర్తి



కిందపడి మోకాలు చీరుకపోయింది. మావారెంత జాగ్రత్తగా తీసుకపోయే వారో"

"అవును. మావారు కూడా. ఒక్కనాడైనా ఎవ్వరూ కింద పడలేదు. ఈయనేమో రోజుకొకర్ని పడేసేటట్టున్నాడు"

"ఆ పొంగలి తినలేక మా ఆయన హోటల్లో టిఫిన్ తిన్నారు"

"మా ఆయన పెరటి వాకిలిగుండా మీరెవరూ చూడకుండా హోటల్నించి కాఫీ పట్టుకొచ్చారు"

ఇలా ఓ పదిరోజులు గడిచింది. ఈసారి అర్ధరాత్రి రహస్య సమాలోచన జరిగింది.

"నిన్న సాంబార్లో కందిపప్పేలేదు. ఉత్త నీళ్లు"

"టీలో ఒక స్పూను పాలు కూడా పడలేదు"

"మొన్నటి వంకాయ వేపుడు ఫ్రిజ్‌లో ఎత్తిపెట్టి నిన్న సాంబార్లో వేసింది"

"ఫోను గంటలు గంటలు మాట్లాడుతుంది"

"పిల్లల్ని ఎక్కువసేపు చదవనీదు. కరెంటు ఖర్చని"

"అవును. పిల్లలు పెన్సిలూ, రబ్బరూ ఒకటే అయ్యేసరికి పోట్లాడుకుంటున్నారు"

"ఎప్పుడు టీవీ చూద్దామని వెళ్లినా ఆ భాస్కర్రావు దరిద్రపు ఇంగ్లీషు సినిమాలే చూస్తుంటాడు"

"మనిండ్లలో అయిన ఖర్చు ఆమె ఇంట్లో సగం కూడా కాదు"

"పైగా లెక్కలు కూడా ఎక్కువ రాస్తోంది"

ఇలా జరిగింది సంభాషణ.

తమ ఇండ్లలో విజయవంతమైన పొదుపు పథకం లక్ష్మి ఇంట్లో ఘోరంగా ఫెయిలయిందని తీర్మానించారు.

★ ★ ★

నెల పూర్తయింది.

రేపు యమున ఇంట్లో మళ్లీ పథకం మొదలుకావల్సి ఉండగా అందరూ ఉన్నప్పుడు ఉష ఇలా అంది.

"మా ఇంట్లో అందరికీ కడుపులో బాగాలేదు. మమ్మల్ని డాక్టరు కొన్నాళ్లు ఉత్త జావమీదే ఉండమన్నారు. కాబట్టి మీ వంట మీరే..."

యమునందుకొని "మాకు అమీబియాసిస్ పట్టుకుంది. పులుపూ కారం తినకూడదు. కాబట్టి..."

మరుసటి రోజు ఎవరింట్లో వాళ్లు వంటలు చేసుకున్నారు.

అంతవరకూ బాగానే ఉందికాని ముందులాగా అందరూ కలిసి మాట్లాడుకోవడం తిరగడం, ఇచ్చిపుచ్చుకోడం ఇప్పుడు లేదు.

ఈలోగా లక్ష్మికి ఎదురింటి యశోద పక్కింటి పార్వతి క్లోజయ్యారు.

తన కుట్టుమిషను సూది విరగ్గొట్టి దాన్ని రిప్లేస్ చేయలేదని యమున ఉషమీద కోపంగా ఉంది.

తమ ఐరన్ బాక్స్ చెడగొట్టినందుకు ఉష యమున మీద కోపంగా ఉంది.

తమ ఫోను బిల్లు ఎక్కువ వచ్చిందని ఉష అందరి మీద కోపంగా ఉంది.

తన పొదుపు పథకాన్ని తోసిరాజన్నందుకు లక్ష్మి వీళ్లిద్దరి మీదా పగబూనింది.

★ ★ ★

రోజులాగే వాళ్ల భర్తలు ముగ్గురూ హోటల్ చంద్రికలో కలిశారు. వాళ్లు చాలా సంతోషంగా ఉన్నారు.

"నే చెప్పలేదా భాస్కర్‌గారూ. నాలుగురోజులు ఓపిక పడితే అన్నీ సర్దుకుంటాయని" అన్నాడు శంకర్రావు.

"అది నిజమేగాని, ఈ మూడు నెలలూ మన హోటల్ బిల్స్ ఎంత పెరిగాయో చూశారా" భాస్కర్.

"ఇప్పుడు ఇల్లు మారాలని, ఇల్లు చూడమనీ తొందరపెడుతోంది మా ఉష. డ్రీమ్ హౌస్‌కి కాదు. విడి హౌస్‌కి, పైగా ఆ చుట్టుపక్కల మీరెవరూ ఉండగూడదట" అన్నాడు కోదండపాణి నవ్వుతూ.

"ఇల్లు మారినా మనం కలుసుకోడం మానకూడదు సుమండీ" శంకర్రావు.

"తప్పక కలుద్దామండీ. బై..బై.."

★



## పియానో మోజు

సెలీనా జైట్లీ ఈమధ్య పియానో క్లాసులకి వెళుతోందిట. ఎప్పుడో చిన్నప్పుడు పియానో వాయించేదిట సెలీనా. మళ్లీ ఇంతకాలానికి పియానోపై మోజు కలిగిందేమో సెలీనాకి రెగ్యులర్ పియానో నేర్చుకుంటోందిట. మెల్లగా పాటలు పాడ్డం కూడా చేస్తుందేమో సెలీనా అని బాలీవుడ్ జనాలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

